ప్రజాశక్తి

సోమవారం 25 మార్చి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

డిఎస్‌సిపై అయోమయం

◆ టెట్ ఫలితాల్లో జాప్యం ◆ పరీక్షా కేంద్రాల ఎంపికకు ఇవ్వని వెబ్ ఆప్షన్

◆ హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ విషయంలోనూ గందరగోళం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

డిఎస్‌సి పరీక్షల నిర్వహణపై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. సోమవారం నుంచి హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకొనే ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు పరీక్షా కేంద్రాల ఎంపిక కోసం అభ్యర్థులకు వెబ్ అప్షన్ ఇవ్వలేదు. దీంతో వారంతా అయోమయ స్థితిలో పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల కాలం నెట్టుకొచ్చి, ఎన్నికల ముందు అతి తక్కువ పోస్టులతో ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్ వివాదాస్పదమైన విషయం తెలిసిందే. బిఇడి అభ్యర్థులకు స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జిటి పోస్టులకు దరఖాస్తు చేసుకొనే అవకాశం నోటిఫికేషన్‌లో ప్రభుత్వం కల్పించింది. దీంతో బిఇడి అభ్యర్థులు కొంతమంది రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకోగా, కొందరు ఒక్క ఎస్‌జిటి పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. బిఇడి అభ్యర్థులకు ఎస్‌జిటి పోస్టులకు అర్హత కల్పించడంపై కొందరు కోర్టును ఆశ్రయించారు. ఎస్‌జిటిలకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఒక్క ఎస్‌జిటి పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేసుకున్న బిఇడి అభ్యర్థులు డిఎస్‌సి పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. ఎస్‌జిటికి అర్హతలేని బిఇడి అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలనుకున్నా అప్పటికి దరఖాస్తు గడువు పూర్తవడంతో డిఎస్‌సికి దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఎస్‌జిటి పోస్టుకు చెల్లించిన దరఖాస్తు ఫీజు రూ.750ను బిఇడి అభ్యర్థులకు ప్రభుత్వం వాపసు ఇవ్వలేదు.



హైకోర్టు ఆదేశాలతో విద్యాశాఖ సవరించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు డిఎస్‌సి పరీక్షలు జరగాల్సివుంది. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలను ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్‌లో ఎంపిక చేసుకొని, 25 (సోమవారం) నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సివుంది. హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకొనే రోజు వచ్చినా, పరీక్ష కేంద్రం వెబ్‌సైట్‌లో ఎంపిక చేసుకొనే ఆప్షన్ విద్యాశాఖ ఇంతవరకు ఇవ్వలేదు. పరీక్షా కేంద్రం నమోదు చేసుకోకుండా హాల్ టిక్కెట్ ఎలా డౌన్‌లోడ్ చేసుకుంటామని అభ్యర్థులు వాపోతున్నారు. మార్చి మిగతా 2లో..

అనకాపల్లికి సిఎం రమేష్, అరకుకు గీత

ఎంపీ స్థానాలకు బిజెపి అభ్యర్థులు ఖరారు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

తర్జనభర్జనల తరువాత అనకాపల్లి, అరకు ఎంపీ సీట్లకు కూటమి నుంచి అభ్యర్థులను ప్రకటించారు. స్థానికేతరుడైన సిఎం రమేష్‌ను అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బిజెపి బరిలో పెట్టింది. కడపకు చెందిన ఆయన పెద్ద వ్యాపారవేత్త, టిడిపి అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి, అరకు ఎంపీ అభ్యర్థులుగా బిజెపి ఆదివారం ప్రకటించిన రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్, కొత్తపల్లి గీతపై వివిధ ఆరోపణలున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో అనకాపల్లి, అరకు ఎంపీ స్థానాలను బిజెపికి కేటాయించారు. ఆ రెండు నియోజకవర్గాల్లో బిజెపికి ఏ మాత్రమూ బలం లేదు. చంద్రబాబుకు సన్నిహితుడైన సిఎం రమేష్‌కు జిల్లాలో టిడిపి నాయకత్వంతో వున్న సంబంధాలు ఎన్నికల్లో దోహదపడతాయని భావిస్తున్నారు. ఆయనకు జిల్లా ప్రజలతో ఏ పరిచయాలూ లేవు. ప్రజలకు చేసిన సేవలూలేవు. టిడిపి బలంతో బిజెపి గెలవాలని చూస్తోంది. సిఎం రమేష్‌కు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ లభించడం వెనుక చంద్రబాబు పాత్ర వుందని ప్రచారం వుంది. టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్‌కు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వకుండా ఈ స్థానం బిజెపికి చంద్రబాబు కేటాయించారు. స్థానికేతరులకు టిక్కెట్ ఇవ్వొద్దని అయ్యన్నపాత్రుడు గతంలో బహిరంగంగానే చెప్పారు. పొత్తులో స్థానికేతరుడైన రమేష్‌కు బిజెపి టిక్కెట్ వచ్చేలా తన శక్తినంతా చంద్రబాబు ఒడ్డారు. అరకు బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతపై ఏజెన్సీలో తీవ్ర వ్యతిరేకత వుంది. గతంలో వైసిపి తరపున ఎంపీగా గెలిచాక మిగతా 2లో..



సిఎం రమేష్ (అనకాపల్లి)



కొత్తపల్లి గీత (అరకు)

ఉబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖ నగరంలో ఉబర్ డ్రైవర్లు వారం రోజులుగా సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో వున్న రేట్లు తగ్గించకూడదని, ప్లాట్‌ఫాం ఛార్జీలను రద్దు చేయాలని, అదనంగా యాజమాన్యం కమీషన్ తీసుకోవడం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. తగ్గించిన రేట్లు పెంచాలని చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైనదని పేర్కొన్నారు. దీనికి సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు వెంటనే కలుగజేసుకొని ఉబర్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చి సమ్మెను విరమింపజేసే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇ - సిగరెట్లు

ఇ - సిగరెట్లు కలకలం

రూ.22 లక్షల విలువైన సరుకు పట్టివేత

వార్త మెయిన్‌లో..

తుపాకులు స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : రామా టాకీస్ సమీపంలోనే శ్రీకృష్ణ ట్రావెల్స్ వద్ద లైసెన్స్ లేకుండా ఉన్న రెండు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఆదివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప మీడియాకు వెల్లడించారు. తుపాకులను కలిగి ఉన్న శ్రీకృష్ణ ట్రావెల్స్ మేనేజర్ వేములకొండ శివ నాగరాజును అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ తుపాకులు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కునాల్ శ్రీవాత్సవని పేర్కొన్నారు. అతడు రెడ్ బస్సు సైట్‌లో విశాఖపట్నం నుండి బెంగళూరు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నాడని, బస్సు ఎక్కేందుకు ట్రావెల్స్ కార్యాలయానికి వచ్చాడని, ఆ సమయంలో అతడి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో ట్రావెల్స్ మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి..

డిఎస్‌సిపై అయోమయం

14న విడుదల చేస్తామన్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్‌) ఫలితాలు ఇంకా ఇవ్వలేదు. గడువు ప్రకారం జరగాల్సిన డిఎస్‌సి పరీక్షల ప్రక్రియ ఏదీ సరిగా ప్రభుత్వం నిర్వహించకపోవడంతో పరీక్షలు జరిగే అవకాశంలేదంటూ వస్తున్న వార్తలతో కొందరు అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పరీక్షా కేంద్రం వెబ్‌ ఆప్షన్‌ పెట్టుకొనేందుకు, పరీక్షల తేదీకి మధ్య వ్యవధి వారం రోజులు కూడా లేదు. ఎన్నికల ముందు నామమాత్రపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ ఇచ్చిన ప్రభుత్వం, వాటి భర్తీకి గడువు ప్రకారం పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేకపోవడంతో అనేక సమస్యలు సృష్టించి పరీక్షలు వాయిదా వేయాలని చూస్తోంది. డిఎస్‌సి పరీక్షలపై విద్యాశాఖాధికారులు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు.

అనకాపల్లికి సిఎం రమేష్‌, అరకుకు గీత

గిరిజనులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఆమెపై వున్నాయి.

జనసేన అభ్యర్థులు ఇలా..

జనసేన అధికారికంగా ప్రకటించిన అభ్యర్థుల్లో విశాఖ దక్షిణం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్‌ పేరు లేదు. ఈ నియోజకవర్గాన్ని పెండింగ్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. అనకాపల్లికి కొణతాల రామకృష్ణ, యలమంచిలికి సుందరపు విజయ్‌కుమార్‌, పెందుర్తికి పంచకర్ల రమేష్‌బాబు పేర్లను ఆదివారం ప్రకటించారు.

తుపాకులు స్వాధీనం

నిర్వాహకులు ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా పారిపోయాడని తెలిపారు. ఈ క్రమంలో అతని బ్యాగ్‌ నుంచి పడిన ఒక కవర్‌తో ఈ రెండు నాటు తపాకులు ఉన్నాయని తెలిపారు. అయితే వాటిని వేములకొండ శివ నాగరాజు సంవత్సర కాలంగా దాచిపెట్టి ఉంచాడన్నారు. ఎన్నికల సందర్భంగా టాస్క్‌ఫోర్స్‌ నిర్వహిస్తున్న దాడుల్లో వీటిని గుర్తించామన్నారు. కునాల్‌ శ్రీవాత్సవను అరెస్ట్‌ చేసేందుకు ప్రత్యేక బృందాన్ని జార్ఖండ్‌కు పంపించామన్నారు.



విసిసి ప్రతినిధులు, విద్యార్థులతో దాతలు

విసిసికి వితరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్‌ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉన్న వైజాగ్‌ చిల్డ్రన్స్‌ క్లబ్‌ (విసిసి) కార్యాలయానికి ఆదివారం శ్రీ బాలాజీ ఫ్రెండ్స్‌ హెల్పింగ్‌ హ్యాండ్స్‌ అసోసియేషన్‌ బీరువా, పుస్తకాల ర్యాక్‌ అందజేసింది. అలాగే జగదాంబ జోన్‌ పరిధిలో పరీక్షలు రాస్తున్న 40 మంది విద్యార్థులకు ఎగ్జామ్‌ కిట్లు పంపిణీ చేసింది. కార్యక్రమంలో శ్రీ బాలాజీ ఫ్రెండ్స్‌ హెల్పింగ్‌ హ్యాండ్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు ఎస్‌.కామేశ్వరరావు, కార్యదర్శి కె.సత్యనారాయణ, కోశాధికారి జి.మల్లికార్జునరావు, రోటరీ క్లబ్‌ ఆఫ్‌ వైజాగ్‌ డైమండ్స్‌ రోటేరియన్‌ ఆర్‌.నీరజ, కెప్టెన్‌ కాళీ ప్రసాద్‌, కె.నగేష్‌ కుమార్‌ పాల్గొన్నారు. పిల్లలకు చదువుతో పాటు సామాజిక స్పృహ కూడా ఉండాలన్నారు. వారిని ఆ దిశగా పెద్దలు ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. విసిసి వ్యవస్థాపకులు డాక్టర్‌ కె.రమాప్రభ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఇంటరాక్ట్‌ డిస్ట్రిక్ట్‌ రిప్రజెంటేటివ్‌ జాహ్నవి, విసిసి జగదాంబ జోన్‌ నాయకులు నరేష్‌, అఖిల్‌ పాల్గొన్నారు.

టిడిపి పార్లమెంట్‌ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టిడిపి పార్లమెంట్‌ నియోజకవర్గ ప్రచార కార్యాలయాన్ని ఆదివారం ఉదయం నగరంలోని ఎంవిపి.కాలనీలో పార్టీ పార్లమెంట్‌ స్థానం అభ్యర్థి ఎం.శ్రీభరత్‌ ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లాసన్స్‌బే కాలనీలోని అతని కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎలక్షన్‌ కోడ్‌ అమల్లో ఉన్నందున తగిన అనుమతులు లభించకపోవడంతో కేవలం ఐదుగురు సభ్యులతోనే పూజా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. విషయం తెలుసుకొని పలువురు కార్యకర్తలు కార్యాలయానికి చేరుకున్నప్పటికీ ఎలక్షన్‌ కోడ్‌ ఆంక్షల కారణంగా వారిని వెనక్కి పంపించామని తెలిపారు. ఇక నుంచి నూతన కార్యాలయం నుంచే ప్రచార కార్యక్రమాలు, ఇతరత్రా పనులు సాగుతాయన్నారు. ప్రారంభ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, బిజెపి ఉత్తర నియోజకవర్గం అభ్యర్థి విష్ణుకుమార్‌ రాజు, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

రైల్వే సమ్మర్‌ కోచింగ్‌ క్యాంప్‌ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ వాల్తేరు డివిజన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మే 15 వరకూ 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లల కోసం నిర్వహించనున్న సమ్మర్‌ కోచింగ్‌ క్యాంపును ఆదివారం ప్రారంభించారు. రైల్వే ఇండోర్‌ స్పోర్ట్స్‌ ఎన్‌క్లేవ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు, డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ సౌరభ్‌ ప్రసాద్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రారంభ వేడుకలో ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే వుమన్‌ వెల్ఫేర్‌ ఆర్గనైజేషన్‌ ప్రెసిడెంట్‌ మంజుశ్రీ ప్రసాద్‌ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సౌరభ్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ క్రీడలకు తగిన ప్రోత్సాహం అవసరమన్నారు. పిల్లల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ నిత్యం కృషి చేస్తోందని తెలిపారు. సమ్మర్‌ కోచింగ్‌ క్యాంప్‌లో అథ్లెటిక్స్‌, బాక్సింగ్‌, బాస్కెట్‌బాల్‌, క్రికెట్‌, బాల్‌ బ్యాడ్మింటన్‌, ఫుట్‌బాల్‌, షటిల్‌ బ్యాడ్మింటన్‌, స్కేటింగ్‌, స్విమ్మింగ్‌, టేబుల్‌ టెన్నిస్‌, టెన్నిస్‌, వాలీబాల్‌ వంటి క్రీడా విభాగాల్లో తర్ఫీదు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎడిఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్‌ కుమార్‌ గుప్తా, ఎడిఆర్‌ఎం (ఆపరేషన్స్‌) మనోజ్‌ కుమార్‌ సాహూ, స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ ప్రవీణ్‌ భాటి, జాయింట్‌ స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ బి.అవినాష్‌, జనరల్‌ సెక్రటరీ రెడ్డి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



బాక్సింగ్‌ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిఆర్‌ఎం సౌరభ్‌ ప్రసాద్‌

గిరిజన పాఠశాల అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్‌ : ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఏజెన్సీలోగల ఒక ప్రభుత్వ గిరిజన పాఠశాల అభివృద్ధికి చేయూత ఇస్తున్నామని చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్‌ షిరీన్‌ రహమాన్‌ తెలిపారు. ఆదివారం విజెఎఫ్‌ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజన యువకుడు లకే సూరిబాబు గీతం యూనివర్సిటీలో ఇంజినీరింగ్‌ పూర్తిచేశాక డిఎడ్‌లో శిక్షణ పొందారన్నారు. 2006లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా నియమితులయ్యారని తెలిపారు. విద్యార్థుల కోసం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. జి.మాడుగుల మండలం ఎం.సంగమం గ్రామంలో ఆయన ఉపాధ్యాయుడుగా పనిచేస్తుండగా గ్రామస్తులలో చైతన్యం తీసుకువచ్చి, గిరిజన పిల్లలు విద్యలో రాణించడం కోసం కృషి చేశారన్నారు. ఫలితంగా విద్యార్థులు సంఖ్య 10 నుంచి 36కి చేరిందన్నారు. ప్రభుత్వం రేకుల షెడ్‌ మాత్రమే అక్కడ ఏర్పాటు చేసిందని, బెంచీలు తక్కువగా వున్నాయని, ఇది తెలిసి అమెరికాలో వున్న స్నేహితులు స్పందించి చేయూత ఇచ్చారని తెలిపారు. తనకు భావరాజు సర్వేశ్వరరావు, వెంకటరత్నం ట్రస్ట్‌ ప్రదానం చేసిన అవార్డు కింద ఇచ్చిన రూ.50 వేలు నగదుకు అదనంగా రూ.15 వేలు కలిపి మొత్తం రూ.65 వేలను 13 బెంచీలు కొనుగోలుకు సూరిబాబుకు అందజేసినట్టు షిరీన్‌ రహమాన్‌ తెలిపారు. యుఎస్‌లో ఉన్న తన తనయుడు సమీర్‌ సిఫార్సుపై ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు.

కార్యక్రమంలో స్వచ్ఛ భారత్‌ అంబాసిడర్‌, ప్రొఫెసర్‌ బాలమోహన్‌దాస్‌, ఉపాధ్యాయుడు లకే సూరిబాబు పాల్గొన్నారు. అలాగే ఎయు హైస్కూల్‌లో చదివిన విద్యార్థులు జస్వంత్‌, రవి రోబోటిక్‌ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో చెరో రూ.2 వేల నగదు పురస్కారాన్ని చైతన్య స్రవంతి సంస్థ అందజేసింది.

సంధ్య ఆక్వా లైసెన్స్‌ రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్‌ : కోట్ల విలువైన డ్రగ్స్‌ను అక్రమంగా విశాఖకు రవాణా చేసిన సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌ లిమిటెడ్‌, దాని అనుబంధ సంస్థల లైసెన్సులను తక్షణం రద్దు చేయాలని విశాఖ మెకనైజ్డ్‌ బోట్‌ ఆపరేటర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం ఫిషింగ్‌ హార్బర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌ ఎఫెక్ట్‌తో మత్స్య ఎగుమతులకు తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపై నిషేధం విధించే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇప్పటికే విదేశాల్లో ఏపి ఎగుమతులను అనుమానిస్తున్నారన్నారు. డ్రగ్‌ డీల్‌ తర్వాత ఆక్వా పరిశ్రమకు నష్టం జరిగే అవకాశం ఏర్పడిందని ఆందోళన వ్యక్తపరిచారు. సంధ్య ఆక్వా సహా అనుబంధ కంపెనీల లైసెన్సులు రద్దు చేయాలని ఎంపెడాకు ఫిర్యాదు చేస్తామన్నారు. డ్రగ్స్‌ దిగుమతి కేసులో విశాఖ కంటైనర్‌ టెర్మినల్‌ను సిబిఐ తన విచారణ పరిధిలోకి తీసుకుని దర్యాప్తు చేయాలన్నారు.

భీమిలి సీటు జనసేనకే కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్‌ : భీమిలి అసెంబ్లీ సీటు జనసేనకే కేటాయించాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బసవ వెంకట కృష్ణయ్య కోరారు. ఆదివారం విజెఎఫ్‌ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

పద్మవ్యూహంలా ట్రాఫిక్

ప్రజల అవస్థలు

ప్రజాశక్తి -తగరపువలస : తగరపువలస జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో జనాభాతో పాటు ప్రజల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా సదుపాయాలు లేవు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా వెడల్పాటి రోడ్లు, పార్కింగ్, ఫుట్ పాత్‌ల నిర్మాణం ఎంతైనా అవసరం. ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నలింగ్ వ్యవస్థ కూడా పూర్తి స్థాయిలో ఏర్పాటు అత్యావశ్యకం. ఇవన్నీ ఉంటేనే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం. వెడల్పాటి రోడ్లు, అందుకు అనుగుణంగా "సెంట్రల్ మీడియన్" నిర్మాణం, ట్రాఫిక్ నియంత్రణకు ఇతరత్రా అవసరమైన వనరులు లేకుండా, ఎంత మంది పోలీసులు ఉన్నప్పటికీ ట్రాఫిక్ నియంత్రణ కష్టం. స్థానిక ప్రధాన రహదారి సుమారు 40 నుంచి 60 అడుగుల మేర ఉండగా, అందుకు తగ్గట్టుగానే నిన్న మొన్నటి వరకు రోడ్డు మధ్యన చిన్న పాటి "సెంట్రల్ మీడియన్" ఉండేది. అయినప్పటికీ ట్రాఫిక్ సమస్య ఉండనే ఉంది. రోడ్డు విస్తరణ చేయకుండానే ప్రధాన రహదారికి మధ్యలో గతంలో ఉన్న దాని కంటే చెరో 6 అంగుళాల వెడల్పున సెంట్రల్ మీడియన్ పునర్నిర్మాణం చేపట్టారు. దీంతో గతం కంటే ట్రాఫిక్ సమస్య మరింత జఠిలం అయింది. ప్రధాన రహదారి మరింతగా వెడల్పు చేసిన తర్వాత "సెంట్రల్ మీడియన్ పునర్నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఎన్నికలకు ముందు అభివృద్ధి చేస్తున్నట్టుగా ప్రచారం చేసుకునేందుకు, కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపించేందుకే ఈ తరహా నిర్మాణాలు అన్న విమర్శ లేక పోలేదు.

పద్మ వ్యూహాన్ని తలపించే లా ట్రాఫిక్..

ఇక్కడ ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపించేలా ఉంటుంది. సమీపంలో ఎన్నో ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలు, ఆసుపత్రులు, మరెన్నో ప్రయివేటు విద్య సంస్థలు ఉన్నాయి. నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాలు, ఉపాధి కోసం నిత్యం వందల మంది ఇక్కడి నుంచి విశాఖ నగరానికి వెళ్తుంటారు. ఇక్కడ చదువుకునేందుకు విశాఖ నుంచి ఇక్కడకు రోజూ విద్యార్థులు వస్తుంటారు. విశాఖ నగరం నుంచి మద్దిలపాలెం, వాల్తేరు ఆర్‌టిసి డిపోలకు చెందిన సుమారు 35 వరకు 222 సర్వీసులు, సింహాచలం ఆర్‌టిసి బస్ డిపో నుంచి దాదాపు 10 వరకు బస్సులు, ఇతర డిపోల నుంచి కూర్మన్నపాలెం, పెందుర్తి ప్రాంతాలకు వస్తూ వెళ్తున్నాయి. కొన్ని బస్సులు విజయనగరం వెళ్తూ వస్తున్నాయి. లెక్కకు మిక్కిలిగా ఆటోలు, క్యాబ్‌లు ఉన్నాయి. ఆదివారం వస్తే ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.



ఆటోలు, బస్సులతో రద్దీగా ఉన్న తగరపువలస జంక్షన్

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

ట్రాఫిక్‌తో చాలా ఇబ్బందులు పడుతున్నాం. జంక్షన్ నుంచి మార్కెట్‌కు నడిచి వెళ్లాలంటే దాదాపు అరగంటకు పైనే పడుతుంది. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.



కాసా శేఖర్

రోడ్డు విస్తరణ అవసరం

పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు చేయాలి. రోడ్డు వెడల్పు చేయాలని జివిఎంసి ఏనాడో ప్రతిపాదనలు తయారుచేసింది. ప్రజలు, వ్యాపారుల అభిప్రాయాన్ని తీసుకొని రోడ్డు వెడల్పు చేయాలి.



రవ్వ నరసింగరావు
సిఐటియు నాయకులు

నేరాలు ఘోరాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : జాతీయ రహదారిపై నాయక్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఉదయం ఓ యువకుడు మృతి చెందినట్లు పిఎం.పాలెం పోలీసుస్టేషన్ సిఐ వై.రామకృష్ణ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధి సాయి ప్రియ గార్డెన్స్‌కు చెందిన కె.జశ్వంత్ (22) నగరంలోని ఒక జిమ్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారి సాయి ప్రియ గార్డెన్స్ నుంచి ఇంటికి వస్తూ దిశా పోలీస్ స్టేషన్ లా కాలేజ్ మార్గ మధ్యలో ఓ ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జశ్వంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రోలుగుంట మండలం శరభవరం గ్రామానికి చెందిన యువకుడు బొబ్బిలి ప్రసాద్ (24) మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ చెప్పిన వివరాల ప్రకారం...కె.కోటపాడులో సార్వత్రిక ఇంటర్ పరీక్షలు రాసేందుకు శనివారం శరభవరం నుంచి బైక్‌పై కోటపాడు వెళ్తున్న ప్రసాద్, చౌడువాడ సమీపంలో ఆర్‌టిసి బస్సును తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాలను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కాగా, కుడికాలు విరిగింది. స్థానికులు 108 వాహనంలో కె.కోటపాడు ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం ఆరోగ్య విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. అచ్యుతాపురంలోని ఇషాన్ చిన్నపిల్లల ఆసుపత్రిలో ప్రసాద్ పనిచేస్తున్నాడని అతని తల్లిదండ్రులు తెలిపారు.

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలం పాతకృష్ణదేవిపేట శివారు బంగారంపేట రహదారిలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గొంప శ్రీను, లోవరాజుకు చెందిన రెండు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. దీంతో రూ.70వేల ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు.

వైభవంగా పైడిమాంబ జాతర

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం ఆర్‌హెచ్ కాలనీ సమీపంలో పైడిమాంబ జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా భీమిలి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆర్‌హెచ్.కాలనీ కొండ సమీపంలో ఉన్న ఆలయానికి వైసిపి ఆరో వార్డు మహిళా అధ్యక్షులు కొండపల్లి వరలక్ష్మి ఆధ్వర్యాన ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారెను సమర్పించారు. తరువాత దిగువున ఉన్న పైడిమాంబ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకునారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎస్.గురుమూర్తి, ఎస్.నర్సింగరావు, వైసిపి నాయకులు గాదె రోశిరెడ్డి, పోతిన సూరిబాబు, జామి శివ, షేక్ జహనార తదితరులు పాల్గొన్నారు.

భీమిలి టికెట్ ఊగిసలాటతో టిడిపి కేడర్‌లో అయోమయం

ప్రజాశక్తి -పద్మనాభం : ఎన్నికల సమయంలో పద్మనాభం మండల తెలుగుదేశం పార్టీ కార్యవర్గం నిశ్శబ్దం పాటించడంతో గ్రామస్థాయిలో ఉన్న నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌పై టిడిపి అధిష్ఠానం ఎటు తేల్చక ఊగిసలాడటంపై మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో కేడర్‌లో ఇంత నిస్తేజం నింపితే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున గంటా శ్రీనివాసరావు, కోరాడ రాజబాబులో ఎవరికి ఇవ్వాలనే దానిపై స్థానిక నాయకుల్లో కూడా స్పష్టత లేదు. వీరిద్దరిలో ఎవరివైపు వెళ్తే తర్వాత ఏమవుతుందోనని ఆందోళన చెందుతూ మిన్నకుంటున్నారు.

ఘనంగా అనంతపద్మనాభస్వామి రథోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం గ్రామంలో అనంత పద్మనాభ స్వామి రథోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి తిరుకల్యాణ ఉత్సవాలలో భాగంగా రథోత్సవ కార్యక్రమాన్ని ఆలయ ఈవో నానాజీ బాబు ఆధ్వర్యాన ఏర్పాటుచేశారు. స్వామివారి కల్యాణం 3వ రోజును పురస్కరించుకుని ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రథోత్సవం రోజున ఉదయం యథావిధిగా కార్యక్రమాలు కొనసాగిన అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి వచ్చిన భక్తులకు గోత్రనామాలతో కుంతి మాధవస్వామి ఆలయంలో పురోహితులు సీతారామ ఆంజనేయులు పూజా కార్యక్రమాలు కొనసాగించారు. రథోత్సవాన్ని తిలకించడానికి పలు గ్రామాలు, పట్టణాల భక్తులు చేరుకున్నారు. రాత్రి పది గంటలకు కుంతీమాధవ స్వామి ఆలయంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీఅనంతపద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను, అప్పటికే గాలి గోపురం వద్ద సిద్ధంగా ఉన్న రథం వద్దకు పురోహితుల బృందం తీసుకొచ్చి రథంపై అమ్మవార్లను ఆసీనులు చేయించారు. పద్మనాభం పోలీస్ స్టేషన్ ప్రధాన అధికారి సిఐ సిహెచ్ శ్రీధర్‌ను ఆలయ సిబ్బంది సన్నాయి మేళాలతో ఆహ్వానించి రథం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు పూసపాటి అశోక్ గజపతిరాజు పూజ అనంతరం స్థానిక సిఐ శ్రీధర్‌తో పూజ ప్రారంభించారు. పూజ అనంతరం ప్రథమ భోగం మద్ది గ్రామానికి చెందిన కనకల ప్రకాష్ కుటుంబానికి ఈ భోగాన్ని ఇచ్చారు. పద్మనాభం గ్రామానికి చెందిన తాలాడ, అవునాపు కుటుంబాలు, కృష్ణాపురం గ్రామానికి చెందిన సుంకర, సూరాల, తాలాడ, మొకర, కనకల కుటుంబాలు చెందిన సభ్యులు పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ముందు నుంచి 300 మంది, వెనుక నుంచి 200 మంది, రథం వేగాన్ని నియంత్రించడానికి కుడి, ఎడమ వైపు 15 మందితో రథాన్ని లాగుతారు. ఆలయానికి తూర్పు భాగంలో ప్రధాన రాజు వీధి నుంచి ప్రారంభమై అప్పవారి వీధి, టాలెంట్ వారి వీధి, బ్రాహ్మణ వీధుల మీదుగా ఆలయం కుడివైపునకు రథం ప్రయాణం సాగుతూ దేవాలయం వెనక భాగం నుంచి ఉత్తర భాగం మీదుగా తెల్లవారి నాలుగు గంటలకు దేవాలయం గాలి గోపురం వద్దకు చేరుకుంది. ఈ రథయాత్రను పురస్కరించుకొని రోడ్డుకు ఇరువైపులా ఆట బొమ్మలు, పలు రకాల దుకాణాల ద్వారా అమ్మకాలు జరిగాయి. వచ్చిన భక్తులకు అన్న సమారాధన, ప్రసాదాలు పంపిణీ వంటి కార్యక్రమాలు జరిగాయి.

పిల్లల్లో చర్మవ్యాధులపై జిమ్సర్‌లో సిఎమ్ఇ



చర్మ వ్యాధులపై వివరిస్తున్న జిమ్సర్ వైద్యులు

ప్రజాశక్తి -మధురవాడ : చిన్న పిల్లలలో కనిపించే చర్మ వ్యాధులు, వాటికి గల కారణాలు, చికిత్సా విధానాలపై రాష్ట్రంలోని పీజీ వైద్య విద్యార్థులకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) డివిఎల్ విభాగం ఆధ్వర్యాన ఆదివారం నిరంతర వైద్య విద్య తరగతులు నిర్వహించారు. వివిధ వైద్య కళాశాలల నుంచి 250 మంది పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు వైద్య విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. జిమ్సర్ డివిఎల్ విభాగం అధిపతి డాక్టర్ బివిఆర్.రామచంద్ర మాట్లాడుతూ, 12 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్నపిల్లలో సంభవించే చర్మ వ్యాధులపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలోని ప్రముఖ చర్మ వ్యాధుల చికిత్సా నిపుణులు రిసోర్స్ పర్సన్లుగా హజరై వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమానికి డాక్టర్ రాహుల్ రాయ్, డాక్టర్ కె.హరిత, డాక్టర్ ఫర్జానా సంధాన కర్తలుగా వ్యవహరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఈవో సింగాల శ్రీనివాసమూర్తి

26 నుంచి సుదర్శన నరసింహ మహాయజ్ఞం

ప్రజాశక్తి-సింహాచలం : సింహగిరిపై వరాహలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో తొలిసారిగా ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న చతుర్వేద హవన పూర్వక పంచాహ్నిక పంచ కుండాత్మక (నరసింహ మహాయజ్ఞం)ను విజయవంతం చేయాలని ఈవో సింగాల శ్రీనివాసమూర్తి, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాస్ ఆచార్యులు, స్థానాచార్యులు డాక్టర్ టిపి రాజగోపాల్ పిలుపునిచ్చారు. నరసింహ మహాయజ్ఞం ఏర్పాట్లపై ఆదివారం వైదిక వర్గాలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మహా యజ్ఞానికి దక్షిణ భారతదేశంలో ప్రముఖ క్షేత్రాల నుంచి పండితులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మంగళవారం సాయంత్రం యజ్ఞానికి అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం ఆగమొక్తముగా యజ్ఞానికి అంకురార్పణ ప్రారంభమవుతుందన్నారు. ఏరోజుకారోజు లఘు పూర్ణాహుతి ఉంటుందని, మొత్తం ఏడు కుండలాలల హోమాలు జరుగుతాయని వెల్లడించారు. ఐదు రోజులు ఐదు వాహనాలతో సాయంత్రం వేళలో స్వామివారి తిరువీధోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. యజ్ఞంలో పాల్గొనే భక్తులకు కావలసిన సౌకర్యాలను అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా టికెట్లు విక్రయాలు చేపట్టామని, ఉదయం వచ్చే భక్తులకు అల్పాహారం ఏర్పాటుచేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఇలు ఆనంద్‌కుమార్, నరసింహారాజువర్మ, పాలూరి నర్సింగరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలి

వార్వా, నివాస్

ప్రజాశక్తి -గాజువాక : రామచంద్రనగర్‌లో ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డును తొలగించాలని వార్వా నివాస్ నాయకులు కోరారు. గాజువాక సెలెస్ట్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వార్వా, నివాస్ గౌరవాధ్యక్షులు డాక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ, రామచంద్రనగర్ డంపింగ్‌యార్డు వల్ల 14 గ్రామాల పరిధిలో దుర్వాసన వెదజల్లుతోందని, వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై గతంలో వార్వా నివాస్ ఆధ్వర్యాన ఆందోళన చేశామని గుర్తుచేశారు. గాజువాకలో ఉన్న జనాభాకనుగుణంగా వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని కోరారు. వార్వా, నివాస్ నాయకులు కె.కిరీటం మాట్లాడుతూ, గాజువాకలో దీర్ఘకాలికంగా ఉన్న హౌస్ కమిటీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. 301 జీవో ప్రకారం ఇచ్చిన పట్టాల్లో అనేక తప్పులున్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ పట్టాలు రాలేదని, మరి కొంతమంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అధ్యక్షులు, వార్వా మెంబర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఈ సమస్యలను రాజకీయ పార్టీలు మెనిఫెస్టోలో పొందుపరిచేలా ఒత్తిడి తెచ్చేందుకు వార్వా, నివాస్ ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఆటోనగర్ పరిశ్రమల వ్యర్థాలను రాత్రిపూట అన్నా క్యాంటీన్ వద్ద తగలబెట్టడం వల్ల శ్రామికనగర్, శ్రీనివాస్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, దశమకొండ, చట్టివానిపాలెం ప్రాంత ప్రజలు విషవాయువు పీల్చి తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కొంతమంది సొంతిల్లు విడిచిపెట్టి వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రాజకీయ నాయకులు ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. వార్వా నాయకులు ఎస్‌వికె.పరుశురాం మాట్లాడుతూ, గంగవరం పోర్టు వల్ల విపరీతమైన కాలుష్యం పెరిగిందన్నారు. గాజువాక, పెదగంట్యాడ, సుందరయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాలన్నీ కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. దీనివల్ల క్షయ తదితర వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. భారీ వాహనాల రాకపోకలు వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. నివాస్ నాయకులు డాక్టర్ పాలూరు లక్ష్మణస్వామి మాట్లాడుతూ, గాజువాక పరిధిలో పూర్తి సౌకర్యాలతో ఆధునిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గాజువాకలో వివిధ వార్డుల్లో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని కోరారు. స్నేహపూరి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కె.రాజు మాట్లాడుతూ, గాజువాకలోని మెకానిక్‌లకు ఒకే దగ్గర స్థలం ఏర్పాటుచేయాలని కోరారు. త్రినాథస్వామి మాట్లాడుతూ అగనంపూడి టోల్‌గేట్ సమస్యను పరిష్కరించాలని కోరారు. వార్వా గాజువాక జోన్ అధ్యక్షులు బి.గుర్రప్ప మాట్లాడుతూ, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో పివైవి.రమణారావు, బంగారునాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వార్వా, నివాస్ నాయకులు



డాక్టర్ ఉదయశ్రీకి బెస్ట్ ఫెర్మార్మెన్స్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఒ జగదీశ్వరరావు, డిటిసిఒ డాక్టర్ పూర్ణేంద్రబాబు

టీబీ నివారణలో కృషి చేసిన పలువురికి అవార్డులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆనందపురం : క్షయ వ్యాధి నివారణలో విశేష కృషిచేసిన ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి నాలుగు అవార్డులు లభించాయి. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక అరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఎంఎల్‌హెచ్ పి.సూర్యకళ, ఎఎన్ఎం కుప్పుదేవి, ఆశ కార్యకర్త గంగాభవానికి ఈ అవార్డులను జిల్లా అధికారులు బహూకరించారు. ఈ సందర్భగా వీరిని పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.గంగునాయుడు, ఎస్‌కె.షహనాజ్ సాధియ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విశాఖపట్నం : ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా డిఆర్‌టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయశ్రీ బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ ఉదయశ్రీకి బెస్ట్ ఫెర్మార్మెన్స్ సర్టిఫికెట్‌ను డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ జగదీశ్వరరావు, డిటిసిఒ డాక్టర్ పూర్ణేంద్రబాబు అందించారు.


మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి సమస్యలు పట్టని ఎమ్మెల్యే : పంచకర్ల

ప్రజాశక్తి-వేపగుంట : పెందుర్తి నియోజకవర్గంలోని ముఖ్యమైన సమస్యలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు పరిష్కరించలేదని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు ఆరోపించారు. జివిఎంసి 92వ వార్డు పరిధి బంటాకాలనీకి చెందిన పలువురు ఆదివారం జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, పంచగ్రామాల సమస్య, తాడి గ్రామం సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. కూటమి అభ్యర్థిగా తాను గెలిచిన తర్వాత ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పార్వతి, జగన్మోహన్, నాగరాజు, ఆనంద్, సాయి, వినోద్, పవన్‌సాయి పాల్గొన్నారు.

వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తే ప్రజాస్వామ్యం విజయవంతం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలని సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్డడీస్, విశాఖ పౌరగ్రంథాలయం సంయుక్త నిర్వహణలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్ రచించిన వై భారత్ మేటర్స్‌పై పౌర గ్రంథాలయంలో చర్చ నిర్వహించారు. ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, వ్యక్తులు మారినా సంస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయన్నారు. జయశంకర్ రచించిన పుస్తకంలోని ముఖ్యమైన అంశాలను ప్రముఖ న్యాయవాది ఎం.రామదాస్ సమీక్షించారు. భారతదేశం ప్రపంచంలో శక్తిమంతమైన దేశంగా ఎదగడానికి తగిన వనరులున్నాయని, వ్యవస్థల మధ్య సమన్వయంతో పాలనసాగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. డాక్టర్ ఎల్‌బి.కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ మధుకుమార్ తన ప్రసంగంలో నెహ్రూ, ఇందిరాగాంధీ, పివి.నరసింహారావు, నరేంద్రమోడీ విధానాలను వివరించారు. గ్రంథాలయం కార్యదర్శి డిఎస్.వర్మ సభకు స్వాగతం పలికారు. వివిధ రంగాలకు చెందిన పలువురు మేధావులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాలను దత్తత తీసుకుంటా

కెకె.రాజు


డిఎల్‌బి గ్రౌండ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తే కొండవాలు ప్రాంతాన్ని దత్తత తీసుకోవడంతో పాటుగా ఆయా ప్రాంత ప్రజలకు అండగా ఉంటానని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు హామీ ఇచ్చారు. జివిఎంసి 48వ వార్డు పరిధి ఎఎస్ఆర్.నగర్ సామాజిక భవనంలో వార్డు పార్టీ శ్రేణులతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కెకె రాజు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో మురికి వాడల అభివృద్ధితో పాటు కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ, వార్డు వారీగా కార్యకర్తలను సమన్వయ పరుస్తూ విజయానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, నాయకులు నీలి రవి, వసంతల అప్పారావు, కర్రి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళింగ, వైశ్య ఆత్మీయ సమావేశం

నియోజకవర్గంలోని ప్రియదర్శిని కాలనీ సామాజిక భవనంలో కళింగ, వైశ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వీరినుద్దేశించి కెకె.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 14 వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, నాయకులు తలాసు సాయిమోహన్, బోగి ప్రవీణ్ కుమార్, గోవింద్ రావు, పొట్నూరు రామ్మోహన్రావు, కోరాడ మోహనరావు, గుడ్ల కృష్ణ, గుడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న వారిని ఆదివారం కెకె రాజు కలిసి ప్రచారం నిర్వహించారు. కొంత సేపు యువకులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ కెకె.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద సింగ్, జివిఎంసి కో- ఆప్షన్, సభ్యులు సేనాపతి అప్పారావు, పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.


ఎం.శ్రీభరత్‌ను అభినందిస్తున్న పరిమి భువనేశ్వరి

శ్రీభరత్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- తగరపువలస : టిడిపి విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌ను జనసేన జివిఎంసి ఒకటో వార్డు అధ్యక్షులు పరిమి భువనేశ్వరి ఆదివారం విశాఖ నగరంలోని అతని నివాసంలో కలిశారు. లోక్‌సభ అభ్యర్థిగా టిడిపి బరిలో ఉన్న శ్రీభరత్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు

ఇంటర్ స్టేట్ ఉమెన్ అండర్-19 రన్నర్స్‌కు రూ. 20 లక్షల పారితోషికం

- యువ క్రికెటర్ల పౌష్టికాహారం కోసం నెలకు రూ. 3 వేలు
- ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం : దేశంలోనే మొట్ట మొదటిసారిగా ఉమెన్స్ టీ-20 లీగ్ నిర్వహించడంతో దేశ వ్యాప్తంగా ఆంధ్రకు మంచి గుర్తింపు వచ్చిందని ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీసీఐ ఇంటర్ స్టేట్ అండర్-19 ఉమెన్ టీ-20 ఛాంపియన్‌షిప్‌లో రన్నర్స్‌గా నిలిచిన ఏసీఏ ఉమెన్ జట్టు సభ్యులకు ఆదివారం పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి వారిని రూ.20 లక్షల పౌష్టికాహారంతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి నాయకత్వంలో క్రికెట్‌లో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. జోనల్ లెవల్ దాటిన యువ క్రీడాకారుల పౌష్టికాహారం కోసం ఏప్రిల్ నుంచి నెలకు రూ. 3 వేల చొప్పున ఆర్థిక సహాయం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందుకుగాను ఏడాదికి రూ.1.50 కోట్లు ఖర్చు అవుతుందని వివరించారు. ఈ ఏడాది నుంచి ఏపీఎల్‌తో పాటు ఉమెన్ ప్రీమియర్ లీగ్‌ను కూడా నిర్వహించడానికి అనుమతి కావాలని బీసీసీఐ కార్యదర్శి జైషాను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆంధ్ర నుంచి అంతర్జాతీయ క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించామన్నారు. జాతీయ జట్టులో చోటు సంపాదించేలా ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లకు దేశంలో ఉత్తమ కోచింగ్‌తో పాటు ఇతర దేశాల్లో వరల్డ్ క్లాస్ శిక్షణ ఇప్పించాలని నిర్ణయించామని తెలిపారు. అనంతరం ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వి.చాముండేశ్వరనాథ్ టీమ్ సభ్యులకు ఎలక్ట్రానిక్ బైక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్.గీత, ఏసీఏ సీఈవో డాక్టర్ ఎంవి.శివారెడ్డి, సీఎఫ్‌వో ఎం.నవీన్‌కుమార్, జనరల్ మేనేజర్లు ఎంఎస్.కుమార్, ఎస్ఎంఎన్.రోహిత్ వర్మ, వీడీసీఏ జనరల్ సెక్రటరీ కె.పార్థసారథి, జాయింట్ సెక్రటరీ జెకెఎం.రాజు, టీమ్ కోచింగ్ స్టాఫ్, సెలక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఉమెన్ రన్నర్స్‌కు చెక్కును అందిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

జాతీయ యోగా పోటీలకు హరికిరణ్



హరికిరణ్ ను అభినందిస్తున్న యోగా కేంద్రం సభ్యులు

ప్రజాశక్తి -చోడవరం : స్థానిక పతంజలి యోగా శిక్షణ కేంద్రం విద్యార్థి కొట్టపు హరికిరణ్ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు కేంద్ర నిర్వాహకులు పుల్లేటి సతీష్ తెలిపారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లో నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాలుగవ జాతీయస్థాయి యోగా పోటీల్లో హరి కిరణ్ పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా హరికిరణ్‌కు చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం అధ్యక్షులు పసుమర్తి శేషశోక్, తవ్వ మురళి. ఎస్ఎస్ షాపింగ్ మాల్ వసుమర్తి గుప్త, రెడ్డి అప్పారావు, యోగా టీచర్ బొగవిల్లి గణేష్ రూ.మూడు వేల ఆర్థిక సాయం అందించారు. జాతీయ యోగా పోటీలకు ఎంపికైన విద్యాకిరణ్‌ను డాక్టర్ బంగారు కృష్ణ, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, ఒరుగంటి రాంబాబు, భోగవిల్లి రవితేజ పతంజలి యోగ శిక్షణ కేంద్ర సభ్యులు, చోడవరం పట్టణ ప్రముఖులు అభినందించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-.అనకాపల్లి : స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం న్యూ కాలనీ న్యూరోటరీ కల్యాణ మండపంలో ఉచిత హోమియో, దంత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు పిజె. నాయుడు, రోటరీ గవర్నర్ బుద్ధ రమణాజీ మాట్లాడుతూ, ఇక నుంచి ప్రతి ఆదివారం ఉచిత హోమియో, దంత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని, హోమియో వైద్యులు డాక్టర్ విల్లూరి జోగినాయుడు, డాక్టర్ కృష్ణమూర్తి, దంత వైద్యులు డాక్టర్ సంజన పాల్గొని రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తారన్నారు. వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. రోటరీ క్లబ్ సెక్రటరీ ఆడారి రామకృష్ణ, ట్రెజరర్ రాపేటి నారాయణరావు, సానా త్రినాథ్ పాల్గొన్నారు.

అంతకాపల్లి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామ ఆరాధ్యదైవం ముత్యమాంబ పండగ సందర్భంగా సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతకాపల్లి పంచాయతీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రికెట్ టోర్నీ దోహదపడుతుందన్నారు. క్రీడలతో మానసికోలాస్సాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించ వచ్చునన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముదుబాబు, యడ్ల నాయుడు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తుల నుంచి దేశ విముక్తికి

అమరవీరుల స్ఫూర్తితో పోరాటం



పట్టణంలో నిర్వహిస్తున్న కాగడాల ర్యాలీ

ప్రజాశక్తి-.అనకాపల్లి : అమరవీరుల స్ఫూర్తితో మతోన్మాద శక్తుల నుండి దేశాన్ని కాపాడుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుండి కాంప్లెక్స్ వరకు కాగడాల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దేశ స్వతంత్రం కోసం 23 ఏళ్ల వయసులోనే భగత్‌సింగ్ ఉరి కంబాన్ని ముద్దాడారన్నారు. దేశానికి సంపూర్ణ స్వతంత్రం, ప్రజలందరికీ ఆర్థిక, సాంఘిక సమానత్వం కావాలని కోరుకున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్న భగత్‌సింగ్ కల నెరవేరలేదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టారనిమండిపడ్డారు. ప్రజల సమస్యలను గాలికొదిలేసి, ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుకు కట్టబెడుతూ బుల్డోజర్ రాజకీయం చేస్తున్నారని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాలపై ఇడి, సిబిఐలను ఉసిగొలిపి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిధులు, వెనకబడిన ప్రాంతాలకి ప్రత్యేక ప్యాకేజీలు లేకుండా పోయాయన్నారు. బిజెపి తీసుకొచ్చిన ఎలక్ట్రోరల్ బాండ్స్ అవినీతికి పరాకాష్ట చేరిందన్నారు. బ్రిటీషర్లు నాడు దేశ సంపదను కొల్లగొట్టుకుపోతే, నేడు మోడీ ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో రైతులు కార్మికులు, విద్యార్థులు, ప్రజలు మరో స్వతంత్ర పోరాటం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి మణి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి రమణ, సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్ వి సత్యవతి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె శాంతి, అల్లు రాజు,సుజాత, పాంగి చలపతి పాల్గొన్నారు.

టిడిపి పూర్వవైభవానికి కృషి చేద్దాం



టిడిపి పూర్వవైభవానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి- దేవరాపల్లి : టిడిపి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగాచంద్రబాబు తనను గుర్తించి ఇచ్చినందుకు సంతోషం కన్నా, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ పార్టీ కార్యక్రమాలకు రాలేదని బాధగా ఉందని మాడుగుల నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని ఎం అలమండ గ్రామంలో మాజీ జెడ్‌పిటిసి పోతల పాత్రనాయుడు అధ్యక్షతన పార్టీ సమావేశంలో ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ టిడిపికి కంచుకోటలాంటి దేవరాపల్లి మండలంలో పూర్వవైభవానికి సమిష్టిగా కృషి చేద్దామన్నారు. వైసిపి అభ్యర్థి బూడిని ఓడించేందుకు ప్రతిఒక్కరూ కార్యకర్తలా పనిచేయాలన్నారు. గ్రామాల్లో వాలంటీర్లు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారని, జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శరకాన సూర్యనారాయణ, చల్ల నానాజీ, కుమార బాబురావు, కర్రి నాయుడు, సర్పంచ్ కర్రి పుష్ప, బండారు రామారావు, కిమిడి నాగేశ్వరరావు, రెడ్డి బలరాం, పోడెల బుజ్జి, దొగ నాయుడుబాబు, పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



కండువాలు వేసి జనసేనలోకి ఆహ్వానిస్తున్న సుందరపు

ప్రజాశక్తి- అనకాపల్లి : మేజర్ పంచాయతీ తుమ్మపాలలో 200 మంది యువకులు వైసిపిని వీడి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. యువ నాయకుడు బొడ్డపాటి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో వీరంతా మాజీ మంత్రి అనకాపల్లి జనసేన టిడిపి బిజెపి కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ సమక్షంలో జనసేనలో చేరారు. వీరికికండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, జనసేన పార్టీకి పనిచేయాలని, అనకాపల్లిలోనూ, రాష్ట్రంలోనూ కూటమి గెలవడం ఖాయమన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కర్రి బాబి పాల్గొన్నారు.

మునగపాక: వైసిపి మండల ఉపాధ్యక్షులు అల్లవరపు రమణబాబుతోపాటు పలువురు ఆదివారం నియోజకవర్గ జనసేనకన్వీనర్ సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు కార్యక్రమంలో జనసేన నాయకులు టెక్కలి పరశురాం ఆడారి సత్యనారాయణ,పైలా రామనాయుడు, బైలంపూడి రామదాసు, ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, మొల్లేటి ఆనంద్, ఆడారి శ్రీకాంత్, ఒంపోలు సర్పంచ్ సూరిబాబు, ఎస్ అప్పలనాయుడు, సరోజిని జనసైనికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఎలమంచిలి నియోజకవర్గ జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో చీమలపల్లి గ్రామానికి చెందిన ఇరవై మంది వైసిపి కార్యకర్తలు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. అలాగే సియాద్రి రవి ఆధ్వర్యంలో కట్టుపాలెం గ్రామానికి చెందిన 15 మంది వైసిపి కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ సుందరపు విజయ్‌కుమార్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాజీ జడ్పిటిసి సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు బయలుపూడి శ్రీరామదాసు, సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, పైల రామనాయుడు పాల్గొన్నారు.

తాడి తరలించే వరకు పైపులైన్ వేయొద్దు



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని తాడి గ్రామానికి ఆనుకుని ఫార్మా సిటీ గ్రీన్ బెల్ట్‌లో రాంకీ యాజమాన్యం చేస్తున్న పైపులైనును తక్షణమే నిలిపివేయాలని గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. తాడి గ్రామం తరలించే వరకు పైపులైన్ వేయొద్దని, ఆ తర్వాత ఏమైనా చేసుకోండని నినాదాలు చూస్తూ ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాదంశెట్టి నీలబాబు, బొడ్డపల్లి అప్పారావు, గంగిరెడ్డి కనకరాజు, జుత్తుక,మాదాలరావు,కోమటి కులదీప్‌రాజ్, మాదంశెట్టి సూరిబాబు, కోమటి అచ్చుబాబు, కోమటి సూరిబాబు, గొల్లవి లచ్చిబాబు,సాలాపు రాజు, కోమటి శివాజీ, కోరుకొండ పైడిరాజు, నల్ల పేరంటయ్య, గొల్లవిల్లి సత్తిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు



పోలీసులకు సూచనలు చేస్తున్న ఎంఎస్‌పి విజయభాస్కర్

ప్రజాశక్తి -పరవాడ: మండలంలో ఎన్నికలకు సంబంధించి దేశపాత్రునిపాలెం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్‌ను ఆదివారం జిల్లా అదనపు ఎస్‌పి బి.విజయభాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న జిల్లా పోలీస్ సిబ్బంది, కేంద్ర పోలీస్ దళాలు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. డబ్బు, మద్యం, నాటు సారా, గంజాయి అక్రమ రవాణా, ఉచిత కానుకలు పంపిణీ నిరోధించేందుకు అరికట్టేందుకు పటిష్ట తనిఖీలు నిర్వహించాలన్నారు. అదనపు ఎస్‌పితోపాటు పరవాడ సిఐ బాల సూర్యారావు పాల్గొన్నారు.

275 మందికి కంటి పరీక్షలు



కంటి వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న దొరైస్వామి

ప్రజాశక్తి - అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఆదివారం నిర్వహించిన 123వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 275 మంది కంటి రోగులను నేత్ర వైద్యులు పరీక్షలు చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 155 మందికి ఉచిత అద్దాలను అందించారు. 83 మందికి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా 30 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయించు కోవాలని వైద్యులు సూచించారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులకు మజ్జిగ, పలహారాలు, భోజనం సదుపాయం కల్పించారు.ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్ట్నర్ దొరస్వామి మాట్లాడుతూ, బ్రాండిక్స్ ఇండియా సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి, స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే కార్యక్రమం లక్ష్యమన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు సమిష్టి కృషి

అవగాహన సదస్సులు, ర్యాలీల్లో విశాఖ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, అనకాపల్లి టీబీ నియంత్రణాధికారి డాక్టర్ బాలాజీ



అనకాపల్లిలో ర్యాలీలో జిల్లా క్షయవ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో క్షయ మహమ్మారిని శాశ్వతంగా నిర్మూలించేందుకు జిల్లా యంత్రాంగం, వైద్యులు, నిక్షయ మిత్రలు, పారిశ్రామిక వేత్తలు కలిసికట్టుగా కృషి చేస్తున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తగిన వ్యాయామం చేయడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ, క్షయ నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం ఆదివారం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహనా ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పరిషత్ వరకు కొనసాగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్న క్షయను కలిసికట్టుగా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 1200 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, మొండి క్షయతో బాధ పడుతున్న వ్యాధిగ్రస్తులు మరో 30 మంది వరకు ఉన్నారని తెలిపారు. వీరందరికీ అవసరమైన మందులను ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ సిహెచ్.పూర్ణేంద్రబాబు, ప్రభుత్వ చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, ఎంఐడిటిసి డాక్టర్ సత్యవేణి, పెందుర్తి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ఆర్కె.దొర, శ్రీకాకుళం విశ్రాంత జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.అనూరాధ, జిల్లా పంచాయతీ అధికారి ఎంవివి శ్రీనివాసరావు, పలువురు వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అనకాపల్లి : క్షయవ్యాధి పట్ల అప్రమత్తత అవసరమనిజిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఎంవిఎస్ బాలాజీ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం డిఎల్ఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ చికిత్సతో క్షయవ్యాధి పూర్తిగా నివారించవచ్చన్నారు. క్షయవ్యాధి లక్షణాలను వివరించి, వ్యాధి నిర్ధారణ జరిగితే వైద్యుల సూచనలతో చికిత్స పొందితే నయమౌతుందన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులతో ఎన్టిఆర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బందికి, టీబి చాంపియన్స్‌కు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా బుచ్చయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆదివారం ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటకృష్ణ, కె.రమేష్, హెల్త్ సూపర్వైజర్ త్రిమూర్తులు, పాల్గొన్నారు.

కశింకోట : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని తాళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం తాళ్లపాలెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు వైద్యాధికారులు యు రమేష్, మనీషా ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆరోగ్య బోధకుడు ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింహారావు, రాధిక , రోజారమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తగరపువలస : క్షయ వ్యాధి నివారణపై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఫణికుమార్, క్షయ వ్యాధి నివారణ విభాగం సిబ్బంది ప్రేమ్‌కుమార్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

సర్వే రాళ్లకు సున్నం



అధికారులు సున్నం వేసిన జగనన్న సర్వే రాళ్లు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ ట్యాంకులు, శిలాఫలకాలు, చివరకు సమగ్ర భూసర్వే సరిహద్దు రాళ్లకు సైతం వైసిపి ప్రభుత్వం వేసిన రంగులను తుడిచే పనులను ముమ్మరంగా చేపడు తున్నారు. భూసర్వే రాళ్లకు వైసిపి రంగులు వేయడంతోపాటు వాటిపై జగనన్న భూరక్ష అంటూ రాసిన రాతలు కనిపించకుండా సర్వే హద్దు రాళ్లకు తెల్లసున్నం వేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. దీనికోసం మండలంలోని పొలాల్లో సరిహద్దు రాళ్లను వెతుకుతూ ఏ ఒక్కటీ తప్పిపోకుండా వాటికి తెల్లసున్నం వేసే పనులు చేస్తున్నారు.

దేవాంగ సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారం



దేవాంగ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి :గొల్లవీధి చౌడేశ్వరి దేవాంగ కల్యాణమండపంలో ఆదివారం అనకాపల్లి పట్టణ చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది.. ఈ సందర్భంగా సంఘ ప్రచార కమిటీ సభ్యులు సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పాలకవర్గం సంఘ అభివృద్ధికి, సభ్యుల పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తారన్నారు కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు రెడ్డి వర ప్రసాద్, కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ముప్పన లింగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు బాసిన బాల గురూజీ, వేమన సంతోష్,కోశాధికారి ముప్పన వాసు పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 400మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామీ రఘువీరానంద మహరాజ్, ఆఫీస్ ఇన్‌ఛార్జి స్వామి వేదవిద్యానంద మహరాజ్, స్వామి సేవ్యానంద మహరాజ్ పర్యవేక్షణలో నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్ గోలి వెంకట రామారావు, డాక్టర్ కస్తూరి సుబ్రమణ్యం డాక్టర్ శ్రీకృష్ణ పాతూరి, డాక్టర్ టివి.సుబ్బారావు డాక్టర్ దాసరి ఉమా మహేష్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్, జిఐఎస్ఎల్ వైద్యబృందం పాల్గొని రోగులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా 95మందికి రక్తపరీక్షలు, 13.మందికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఇసిజిలు, 15మందికి ఎక్స్‌రేలు, ఐదుగురికి ఫిజియోథెరపీ చేశారు.

72మందికి ఉచిత కంటిపరీక్షలు

అలాగే వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించి 72మందికి నేత్రపరీక్షలుచేశారు. 24మందికి కంటిఅద్దాలు అందజేయగా, ఆరుగురిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి వేమగిరి ఆసుపత్రికి తరలించారు. ప్రతివారం నిర్వహించే వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వైద్యశిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్లుఎల్. జిబి.భగిరథరాజు. ఉదయ్‌కిరణ్. మంగిరెడ్డి, వి.వెంకట సూర్యచంద్రం, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు, రోగులు, సహాయకులకు భోజన సదుపాయం సమకూర్చినట్లు స్వామీజీ తెలిపారు.

టిడిపిలో చేరిన పాల్తేటి

ప్రజాశక్తి-కె కోటపాడు : మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు ఆదివారం చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.కె.కోటపాడు మండలం రామయోగి అగ్రహారం గ్రామానికి చెందిన పాల్తేటి పెంటారావు విద్యార్థి దశ నుండే దళిత ఉద్యమాలు నిర్వహించేవారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగవిరమణ పొందిన తర్వాత, పూర్తిగా దళిత ఉద్యమానికే అంకితమై, కుల సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నారు. మాల మహానాడు అధ్యక్షుడిగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన పాల్తేటి పెంటారావు తెలుగుదేశం పార్టీలో చేరడం వల్ల పార్టీకి మరింత బలాన్ని చేకూరుతుందని మాడుగుల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. పెంటారావుతోపాటు మహిళా విభాగం అధ్యక్షురాలు నక్కలి నాగమణి కూడా తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

'కాఫీ విత్ కూటమి క్యాడర్'తో కొణతాల



ఆత్మీయ సమావేశంలో కొణతాల, పీలాలకు గజమాలతో సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మున్సిపాలిటీ పాత 3,4,5 వార్డులు లక్ష్మీదేవి పేట తదితర ప్రాంతాల్లో కూటమిలోని మూడు పార్టీల శ్రేణులతో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది .జనసేనలోకి 20మంది వైకాపా నేతలు చేరారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బిఎస్ఎం కె జోగి నాయుడు సమక్షంలో 80 వార్డు డివిజన్ అంబేద్కర్ నగర్లో కూటమి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ విజయాన్ని ఆకాంక్షిస్తూ స్థానిక వార్డు అధ్యక్షులు కర్రి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారం ప్రారంభించారు.కూటమి నేతలు మారిశెట్టి భాస్కరరావు, విల్లూరి హరికృష్ణ, మళ్ల శ్రీనివాసరావు, బొడ్డేటి మురళి, గోవాడ రాజు, మగ్ర జాగనూకేశ్వరరావు, బుద్ధ శ్రీనివాసరావు, బుద్ధ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సంతోష్ ,బొడ్డేటి నూకరాజు, దూలం ప్రసాద్, బుద్ధ విశ్వనాథం, పీలా హరి,బుద్ధ శ్రీనివాసరావు, బుద్ధ జోగినాయుడు జనసేన పార్టీ నాయకులు కోరిబిల్లి పరి, పిల్ల కొండయ్య నాయుడు, బుద్ధ లక్ష్మణరావు, సూరిశెట్టి రాముడు, పీలా రాముడు, కర్రి జగదీష్, బుద్ధ లక్ష్మణరావు, కాండ్రేగుల రవణ అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో ఆదివారం టిడిపి, జనసేన, బిజెపి ఆత్మీయ సమావేశం జరిగింది కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలిపించాలని కోరారు సీనియర్ నాయకుడు కొణతాల లక్ష్మీనారాయణ మాట్లాడారు.

కొణతాలకు జోగేంద్ర మిత్ర బృందం మద్దతు

అనకాపల్లి : పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు, వైసిపి నేత కాండ్రేగుల జోగేంద్ర, గోవింద బ్రదర్స్ మిత్రమండలి కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతు ప్రకటించారు. గవరపాలెం పార్క్ సెంటర్లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో 200 మంది యువకులు జనసేన పార్టీలో చేరాలని నిర్ణయించారు. కార్యక్రమంలో దాడి త్రినాథ్, కాండ్రేగుల సునీల్, వెల్లూరి బాలు, కాండ్రేగుల రాజేష్, కాండ్రేగుల శ్రీనివాస్, పెంటకోట అరవింద్, సత్యదేవ్, లోవ కుమార్, ఉమా మహేష్, శంకర్, బిఎం నాయుడు, మళ్ల జగన్నాధ రావు, దీపక్, సంతోష్, శివయ్య, శిరీష్, కొప్పాక యూత్, కోటినివేది యూత్, అగ్రహారం యూత్ , రంగేళి బ్యాచ్ పాల్గొన్నారు.

ఎఐటియుసి జిల్లా నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన ఎఐటియుసి కార్యవర్గ ప్రతినిధులు

ప్రజాశక్తి - అనకాపల్లి : ఎఐటియుసి అనకాపల్లి జిల్లా ప్రథమమహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షులుగా వైఎన్.భద్రం, అధ్యక్షునిగా పెంటకోట సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షునిగా గనిశెట్టి ఏసుదాసు, ఉపాధ్యక్షులుగా ఎం అర్జున్‌కుమార్, కోన లక్ష్మణ, ప్రధాన కార్యదర్శిగా రాజాన దొరబాబు, కార్యదర్శులుగా ఎం.అప్పలరాజు, కండిపల్లి త్రినాథ్, కోశాధికారిగా రెడ్డిపల్లి అప్పలరాజుతోపాటు 13 మంది కౌన్సిల్ సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు జి.అచ్యుతరావు, సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ సంబరం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం హోలీ వేడుకలను జరుపుకున్నారు. యువకులు, చిన్నారులు పరస్పరం రంగులు చల్లుకుంటూ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.



ఉత్సాహంగా రంగులు చల్లుకుంటున్న యువత, చిన్నారులు

ఎన్నికల నియమావళిని పాటించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని తహసిల్దార్ వెంకటరమణ సూచించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఇప్పటికే రేషన్ బండ్లు, విగ్రహాలు, సిమెంట్ బెంచీలపై కూడా పార్టీ జెండా సూచికలు, రాజకీయ నాయకుల చిత్రపటాలు బహిరంగంగా కనిపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సర్వేలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాలలో సర్వే రాళ్ల ప్లాంటేషన్ పై ఉన్న వైయస్సార్, జగనన్న భూ రక్ష పేర్లు కనిపించకుండా రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 11 గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా దాదాపు ఆయా గ్రామాల్లో సర్వే రాళ్ల ప్లాంటేషన్ పూర్తయిందన్నారు. ఇందు నిమిత్తం 12800 రాళ్లు సిద్ధం చేయగా వాటిపై ఎటువంటి రాజకీయ నాయకుల పటాలు, పేర్లు, ముద్రలు లేకుండా రంగులు పూసేందుకు అధికారులకు సూచించామని తెలిపారు. ఇప్పటికే చాలా గ్రామాలలో ప్లాంటేషన్ రాళ్లపై ఫోటోలు, నాయకుల పేర్లు కనిపించకుండా రంగులు పూసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నియమాలను పాటించాలన్నారు. శాంతియుతంగా పోలింగ్ జరిగేలా సహకరిం చాలన్నారు. ఇప్పటికే స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల సదుపాయంపై చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు.



రేషన్ వాహనాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు


నువ్వుల పంట

ఆశాజనకంగా నువ్వుల సాగు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షానికి నువ్వు సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాజుపేట, సుంకపూరు, చౌడువాడ, లింగాపురం, ఎండపల్లి, కోటవురట్ల సహా పలు గ్రామాలలో ఖరీఫ్ వరి అనంతరం రబీలో నువ్వుల పంట సాగు చేస్తున్నారు. నువ్వు పంట సుమారు 200 హెక్టర్లు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత కాపు దశలో ఉంది. ఇటీవల వర్షం కురవడంతో ప్రధానంగా మెట్ట ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురువకుంటే సాగునీటికి అదనపు ఖర్చు అయ్యేదని రైతులు అంటున్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల కేంద్రంలోని విద్యా వికాస్ స్కూల్ వద్ద విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కరస్పాండెంట్ పాప సాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు. మీరిలో 30 మందిని కంటి ఆపరేషన్‌కు విశాఖకు తీసుకు వెళుతున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ సురేష్, శంకర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ అశ్విని కుమార్ తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో దేవి ప్రతిభ

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్:ఈనెల 18 నుండి 22 వరకు న్యూఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 87కేజీల కేటగిరీ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో నర్సీపట్నం మండలం చెట్టుపల్లి జెడ్పీ హైస్కూల్ ఫీజికల్ డైరెక్టర్ గుడివాడ దేవి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా నింజాస్ అకాడమీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, సుతాపల్లి బ్రదర్స్ శ్రావణ్, శ్రీకాంత్, ఉమెన్ డైరెక్టర్స్ సైకాలజిస్ట్ సుమ, పివిఎన్.నాగజ్యోతి అభినందించారు. ఈ సందర్భంగా శాప్ కోచ్ అబ్బు మాట్లాడుతూ, ఆమె వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్‌లో సీనియర్ నేషనల్ ఆల్ ఇండియా యూనివర్సిటీలో కూడా అనేక పతకాలు సాధించారని, ఎంతో మంది విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.



దేవి విజయాన్ని ప్రకటిస్తున్న నిర్వాహకులు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

వైసిపిలో పలువురు చేరిక

- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం మండలంలోని చెట్టుపల్లి, అమలాపురం పంచాయతీ ఉప్పరగూడెం, మాకవరపాలెం మండలం కొత్తపాలెం గ్రామాలకు చెందిన సుమారు 100 టీడీపీ కుటుంబాలు ఆదివారం వైసీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి తాను తగిన గుర్తింపు ఇస్తానని హామీ ఇచ్చారు. మరో 40 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు వైసిపిలో చేరనున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండల పార్టీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, మాకవరపాలెం ఎంపిపి రుత్తల సత్యనారాయణ, మాకవరపాలెం మండల పార్టీ అధ్యక్షుడు రుత్తల వాసు, అమలాపురం సర్పంచ్ శెట్టి శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, టౌన్ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం :

ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు సమక్షంలో ఆదివారం దిబ్బపాలెం కాలనీవాసులు వైసిపిలో చేరారు. కొండకర్లలోని ఎమ్మెల్యే గెస్ట్ హౌస్‌కు కాలనీవాసులు వచ్చి ఎమ్మెల్యేకు గెలుపుకు సంఘీభావం తెలిపారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు.కార్యక్రమంలో దిబ్బపాలెం జనసేనయూత్ వైస్ ప్రెసిడెంట్ అందే బాబ్జి, గుర్రం సూరిబాబుతోపాటు పలువురు వైసిపిలో చేరారు.కార్యక్రమంలో కోట దేవుళ్ళు, కోట చంద్రరావు వైసిపిలో చేరారు.


అభివాదం చేస్తున్న పైలా, నాయకులు

పైలా ప్రసాదరావుకు సత్కారం

ప్రజాశక్తి -చీడికాడ:మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాద్‌రావును చీడికాడ మండలం అర్జునగిరి గ్రామం నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ, ఒకప్పుడు టిడిపికి కంచుకోటగా వున్న మాడుగుల నియోజకవర్గంలో మారలా వైభవం తీసుకు రావడానికి ప్రతీ నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. జిల్లాలో బాగా వెనుకబడి వున్న మాడుగుల నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో .జాజిమొగ్గల ప్రసాద్, ఎంపీటీసీ పెంటకోట అమ్మతల్లి నాయుడు, కోవెలపల్లి గోవింద్, జాజిమొగ్గల పాలవెల్లి నాయుడు, జనసేన పార్టీ మండల కార్యదర్శి పెంటకోట సూరిబాబు, జనసైనికులు కిరణ్,గొర్లి సుబ్రహ్మణ్యం, పెంటకోట పురుషోత్తం, పెంటకోట శ్రీను, అద్దిపల్లి శివాజీ, బీజేపీ నాయకులు వేపాడ శ్రీనివాస్, పెంటకోట ఎరకునాయుడు పాల్గొన్నారు.

వసతి గృహాలను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంమండలంలోని వేములపూడిలో ఉన్న ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ మాట్లాడుతూ, ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలను బాగా రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల సెక్రటరీ రాజు, డివిజన్ సభ్యులు తేజ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత గీతాకృష్ణ

ఉపాధ్యాయుడిని నియమించాలి : సిపిఎం

ప్రజాశక్తి -అనంతగిరి:రెండు మండలాల సరిహద్దు పివిటిసి పట్కదౌడ గ్రామంలో ఉపాధ్యాయుడుని తక్షణమే నియమించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్,నాగులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ గ్రామంలో సందర్శించిన ఆయన పివిటిజి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు మాట్లాడుతూ, తమ గ్రామాంలో ఉపాధ్యాయుడు అకాల మరణంతో సుమారు ఆరు నెలలకు పైగానే పాఠశాల మూత పడిందని తెలిపారు. దీంతో విద్యార్థుల చదువులు సాగలేదన్నారు.ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, పట్క దౌవడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఆరు నెలల నుంచి ఉపాధ్యాయుడిని నియమించక పోవడంతో విద్యార్థులకు విద్య అందలేన్నారు. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుడిని నియమించి విద్యాబోధన అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచని తాగునీటి బోరు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని పోతంగి సచివాలయ కార్యాలయానికి ఎదురుగా ఉన్న తాగునీటి బోరు మరమ్మతుకు గురై సుమారు నెల రోజుల నుంచి నిరుపయోగంగా ఉంది. స్థానిక గిరిజనులతో పాటు వివిధ పనుల నిమిత్తం యూనియన్ బ్యాంక్, పోతంగి సచివాలయానికి వచ్చిన గిరిజనుల దాహార్తి తీర్చు కోవడానికి ఈ బోరు ఎంతో ఉపయోగపడుతుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చిన గిరిజనులు తాగునీటి కోసం పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కారణంగా సచివాలయం వీధిలో ఉన్నవారికి తాగునీటి సమస్య ఏర్పడుతుంది. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి బోరు మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పని చేయని బోరు



విజయం సాధించిన జట్టు సభ్యులు

క్రికెట్ పోటీల్లో జాలంపల్లి జట్టు విజయం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని సాగరం గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో జాలంపల్లి జట్టు విజయం సాధించింది. ఆదివారం సాగరం గ్రామంలో మోదకొండమ్మ పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాగరం మోదకొండమ్మ పండుగను పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో 36 జట్లు తలపడ్డాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో జాలంపల్లి జట్టు గెలుపొంది మొదటి బహుమతి 20వేలు కైవశం చేసుకుంది, ద్వితీయ బహుమతి సాగరం జట్టుకు 15వేలు, తృతీయ బహుమతి రావికమతం జట్టు పదివేలు అందుకున్నాయి. జాలంపల్లి జట్టును మాజీసర్పంచ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నమ్మి బాలరాజు అభినందించారు.



నగదును పరిశీలిస్తున్న పోలీసులు

రూ.2 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఆదివారం కారులో రూ.2లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నామని సిఐ విజయ్ కుమార్ తెలిపారు. గాజువాక కణిత రోడ్ కు చెందిన గంగుమల్ల ప్రమోద్ కారులో పాయకరావుపేట నుంచి యలమంచిలికి ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా రూ.2లక్షలు నగదు తరలిస్తున్నారన్నారు. తనిఖీ చేసి సీజ్ చేసినట్లు సిఐ వెల్లడించారు.



అనితను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఘనంగా అనిత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నక్కపల్లి: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అనిత ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు కృష్ణమాచార్యులు ఆమె పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెకు వెంకన్న చిత్రపటాన్ని బహూకరించారు. నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్లో జరిగిన అనిత జన్మదిన వేడుకల్లో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు హాజరై అనితను గజమాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనిత కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, చిట్టిబాబు, అబద్దం, శ్రీను, కురందాసు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఐసిడిఎస్ కార్యాలయం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో దాదాపు 30 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన ఐసిడిఎస్ కార్యాలయం ప్రస్తుతం వృధాగా దర్శనమిస్తుంది. ఈ కార్యాలయాన్ని నక్కపల్లి మండలానికి మార్పుడంతో పాటు గతంలో నాతవరం, మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు సిడిపిఓ కార్యాలయంగా ఉండేది. ప్రస్తుతం పాయకరావుపేట నియోజకవర్గం అంతా ఒకటే సిడిపిఓ కార్యాలయం కావడంతో కోటవురట్ల మండల అంగన్వాడి కార్యకర్తలు అంతా నక్కపల్లిలో సమావేశాలకు వెళ్లాల్సి ఉండడంతో ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా దర్శనమిస్తుంది.



నిరుపయోగంగా ఉన్న ఐసిడిఎస్ కార్యాలయం

టిడిపిలో పలువురు చేరిక



నర్సీపట్నంలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మండలం గురందొర పాలెం గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం అయ్యన్న మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో కుంటుపడిన ఆంధ్ర అభివృద్ధి

అచ్యుతాపురం: ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి నేతృత్వంలోని వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటు పడిందని మాజీ ఎంపి పప్పుల చలపతిరావు అన్నారు. ఆదివారం. నునపర్తి గ్రామంలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీకి చెందిన నడింపల్లి, జిపి అగ్రహారం, అయితవాని పాలెం గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వారందరికీ ప్రగడ నాగేశ్వరరావు ,టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ తదితరులు కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో పార్టీ కార్యకర్తలు కష్టపడి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేశారన్నారు. వైసిపి అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు జానపద రెడ్డి నరసింగరావు రెడ్డి సన్యాసినాయుడు ,మెరగు బాబు నాయుడు, రాజాన నానాజీ, గొంపా. నరసింహనాయుడు పాల్గొన్నారు.

సూరిబాబు సేవలు చిరస్మరణీయం

-నేడు శెట్టి పాలెంలో సంస్మరణ కార్యక్రమం

ప్రజాశక్తి- కోటవురట్ల: అతి చిన్న వయసులోనే గ్రామ రెవెన్యూ అధికారిగా ఉద్యోగం పొంది రాజకీయ రంగం, పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న రాజుపేట సచివాలయ గ్రామ రెవెన్యూ అధికారి లాలం సూరిబాబు(38) అకాల మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అందించిన విశిష్ట సేవలతో కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో పలువురి మదిలో నిలిచి పోయారు. ఆయన సేవలను పలువురి కొనియాడుతున్నారు. సూరిబాబు పని చేసిన ఐదేళ్ల సర్వీసులోనే సేవలకు గాను జిల్లా కలెక్టర్ నుండి రెండుసార్లు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. రాజుపేట గ్రామంతో పాటు సుంకపూరు, జల్లూరు గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న సూరిబాబు మెదడుకు సంబంధించిన వ్యాధితో విశాఖలో చికిత్స పొందుతూ ఈనెల 14వ తేదీన మృతి చెందారు. ఆయన మరణంతో సహచర ఉద్యోగ, సచివాలయ సిబ్బందితో పాటు మాకవరపాలెం మండలంలో రాజకీయ నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఉద్యోగ, రాజకీయ, వ్యక్తిగత సమస్యలపై సూరిబాబు స్పందించి తనదైన శైలిలో పరిష్కరిస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారు. సూరిబాబు మరణం పట్ల కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం మండలాల రెవెన్యూ సచివాలయ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, పత్రికా ప్రతినిధులు, గ్రామస్థాయి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సూరిబాబుకు తల్లి, తండ్రితో పాటు ఇద్దరు అన్నయ్యలు ఉన్నారు. వీరంతా సూరిబాబును అల్లారు ముద్దుగా పెంచుకోవడంతో అతని మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. సూరిబాబు సేవలను స్మరించుకుంటూ ఈనెల 25న సోమవారం శెట్టిపాలెం గ్రామంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



జాతీయ రెజ్లింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-అరకులోయ: జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు అరకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని పి..నిర్మల ఎంపిక అయినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో చిత్తూరు డిఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని పి.నిర్మల బంగారు పతాకాన్ని కైవశం చేసుకుందని తెలిపారు. ఈనెల 28న ఉత్తర ప్రదేశ్ లోని నోయిడలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. బంగారు పతాకాన్ని గెలుచుకున్న నిర్మల జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి మహిళా డిగ్రీ కళాశాలకు, అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. నిర్మలను మహిళ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు, అధ్యాపకులు రోజా రాణి, లాలి కుమారి, ప్రణీత, ధర్మారావు, దివ్య మౌనిక, కామేశ్వరరావు, కళాశాల పిడి అప్పారావు, గోపాలకృష్ణ, వేణు , సిబ్బంది, బంధువులు అభినందించారు.

రోడ్డు పనులు పున:ప్రారంభించాలని..

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, నిలిచిన రోడ్డు పనులు వెంటనే పున: ప్రారంభించాలని గిరిజనులు వినూత్న రీతిలో జల దీక్ష చేపట్టారు. మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధి కరీగొడా, కడరేవు గ్రామాలకు చెందిన గిరిజనులు ఆదివారం వినూత్న రీతిలో డోలీ సహాయంతో జల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, గుమ్మ పంచాయతీ నిమ్మ ఊట గ్రామం, క్రి గోడ, కడరేవు, పిన్నకోట పంచాయతీ పరిధి కొట్టంగుడా, గొప్పులపాలెంలో సుమారు 160 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామన్నారు. 2021 ,22 సంవత్సరంలో రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం కోటి 20 లక్షల నిధుల మంజూరు చేయగా అధికారులు రోడ్డు పనులు మొదలుపెట్టి కిలోమీటర్ వరకూ చేపట్టి అసంపూర్తిగా వదిలివేసారని విమర్శించారు. గిరిజనులు రోగాల బారిన పడినప్పుడు వైద్యం కోసం ఆసుపత్రులకు డోలీల్లో తరలిస్తున్నారని సకాలంలో వైద్య సేవలు అందక గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు మృత్యువాతకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే డోలీ మోతలతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాప రాజారావు, నందోలి రాజారావు, ఉల్లి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు